సాక్షి
వరంగల్
ఆదివారం । 21 । జూలై । 2024



ఉధృతంగా గోదావరి
ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.
- 8లో▸



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్
తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేసినట్లు మానుకోట ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చెన్నారావుపేట: గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి ఆరోగ్యాన్ని నిశితంగా పరిశీలించాలని మెటర్నరీ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించి ఏఎన్‌సీ క్లినిక్‌ను పరిశీలించి, మాట్లాడారు. సిబ్బంది, ఆశ కార్యకర్తలు నిరంతరం గ్రామాల్లో సందర్శించి నిర్దేశించిన టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ఏఏఎం(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) కేంద్రాల్లో కూడా గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, ఎంఎల్‌హెచ్‌పీలు సహజ, భవానీ, దయకుమారి, సూపర్‌వైజర్ సువార్త, వైద్య సిబ్బంది రాజకుమారి, శ్వేత, కాంతి, సరిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణమాఫీపై టోల్ ఫ్రీకి విశేష స్పందన

కాశోజీ సెంటర్: రైతు రుణమాఫీ విషయంలో రైతులకు లబ్ధిచేకూరేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో జిల్లాలో ఏర్పాటుచేసిన హైల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్స్ ద్వారా శనివారం 48మంది తమ సందేహాలను నివృత్తి చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు రైతులు 25మంది తమకు రుణమాఫీ కాలేదని టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేశా రు. ఈ మేరకు పీఏసీఎస్ బ్యాంక్‌కు సంబంధించి ఇద్దరు రైతులు, సెంట్రల్ బ్యాంక్ ఒక్కరు, ఎస్‌బీహెచ్ ఒకరు, డీసీబీ ఇద్దరు, ఎస్‌బీఐ ముగ్గురు, బరోడా బ్యాంక్ ఇద్దరు, ఇండియన్ బ్యాంక్ ఒకటి, సెంట్రల్ బ్యాంక్ ఒకటి, కేజీబీవీ 4, యూనియన్ బ్యాంక్ ఐదుగురు రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరికొంత మంది రైతులు రుణమాఫీ జాబితాలో తమ పేరు ఉందో లేద నని అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సభ్యుడిగా ప్రభాకర్



ఖిలా వరంగల్: సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జిల్లా సభ్యుడిగా కొయ్యాడ ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా అడిషనల్ సెక్రటరీ పి.డానియేల్ నుంచి శనివారం ప్రభాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ నియామకం చేశారని, సమస్యల పరిష్కారం కోసం మరింత బాధ్యతగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ప్రతినిధులకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి



రాయపర్తి(వర్ధన్నపేట): వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా ఆదేశించారు. శనివారం వర్ధన్నపేటలోని పురపాలక సంఘం కార్యాలయంలో వార్డు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాలాలను గుర్తించాలన్నారు. గుంతలు, శిథిలావస్థకు చేరిన, మట్టిగోడలున్న ఇళ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కిరణ్, రెవెన్యూ అధికారి శ్రావణ్‌కుమార్, కాసర్ల ఐలయ్య, శంకర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండేళ్లకు మించి విధులు కొనసాగించిన జూనియర్ అసిస్టెంట్ నుంచి అటెండర్‌స్థాయి వరకు ఉద్యోగుల బదిలీలు శనివారం ఖరారయ్యాయి. శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఉద్యోగుల బదిలీ జాబితా అందజేశారు. కాగా శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా ఉమ్మడి జిల్లాలో 39మంది జూనియర్ అసిస్టెంట్లు, 20మంది ఆఫీస్ సబార్డినేటర్లు, ఒక టైపిస్ట్, నలుగురు షెరఫ్‌లు బదిలీపై వెళ్తున్నారు. కాగా, సోమ లేదా మంగళవారాల్లో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు రిపోర్టింగ్ చేసే అవకాశం ఉంది.

ఆదమరిస్తే ముప్పే..

విద్యుత్ వినియోగంలో అప్రమత్తత అవసరం
- సమస్యలు వస్తే అధికారులను సంప్రదించాలి
- జాగ్రత్తలు పాటిస్తే మేలు



చెన్నారావుపేట: ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యాయి. రైతన్నలు వ్యవసాయ పనుల్లో ఇప్పుడిప్పుడే నిమగ్నమవుతున్నారు. జిల్లాలో 74సబ్‌స్టేషన్ల పరిధిలో దాదాపు 4లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో 66వేల వ్యవసాయ వినియోగదారులు ఉన్నారు. సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు, గృహ విద్యుత్ వినియోగదారులు అజాగ్రత్త వలన విద్యుత్ ప్రమాదాలకు గురువుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

ప్రమాదాలకు ప్రధాన కారణం

చిన్న అజాగ్రత్తతో కొన్నిసార్లు ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. దుస్తులు ఆరవేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఇనుప తీగలను వినియోగిస్తుంటారు. ఆ తీగలు ఏ చిన్న పొరబాటు జరిగినా విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలకు కారణం అవుతుంటాయి. ప్లాస్టిక్ లేదా.. సాధారణ తాడు ఉపయోగిస్తే ప్రమాదాల నుంచి బయటపడొచ్చు. దీంతోపాటు, అవగాహన లోపంతో వినియోగదారులు తమ గృహాలకు విద్యుత్ సరఫరా చేసే తీగలు, విద్యుత్ పరికరాలు నాసిరకం వాడడం, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రతా ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించకపోవడంతో విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి.

పాటించాల్సిన సూచనలు..

ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున, కరెంటు మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వులను ఏమరపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయని పరికరాల వల్లే ఎక్కువగా జరుగుతాయి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫుట్ వాల్వు తాకడం అత్యంత ప్రమాదకరం. దీంతోపాటు, రైతులు, వినియోగదారులు తమ గృహాలు, బోరు బావుల మోటార్ల వద్ద తలెత్తే విద్యుత్ సమస్యలను స్వయంగా మరమ్మతు చేసుకోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. అలా చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేయించుకోవాలి. వ్యవసాయ పంపు సెట్లకు ఫేజ్ కన్వర్టర్ వాడడం నిషేధం. వ్యవసాయ మోటార్లు, గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైరును ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది. కరెంట్ లైన్ల కింద పందిరిలు (టెంట్) వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. వర్షాకాలంలో స్తంభాలు తడిగా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కావున మానవులు, పశువులు స్తంభాల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్లు వాడాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్చుల ఆపరేట్ చేయడం, కాలిన తీగెలను సరియడం ప్రమాదకరం. చేపల వేటకు విద్యుత్ తీగెలను అమర్చడం వల్ల షాక్ గురై చనిపోయే ప్రమాదం ఉంది. సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురై చనిపోతారు. జంతువుల నుంచి పంట రక్షణకు విద్యుత్ ఫెన్సింగ్ రీత్యా నేరం. పొలాలకు విద్యుత్ కంచెలు వేయకూడదు. వర్షాలు కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాలు స్టే వైరు/ సపోర్ట్ వైరును, తడిసిన విద్యుత్ ఉపకరణాలను తాకకూడదు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకకూడదు. గమనించిన వెంటనే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలి. ఎవరికైన పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో ప్రమాదం సంభవించిన వ్యక్తిని ముట్టుకోకూడదు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని(కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను మాత్రమే ఉపయోగించాలి.

సమస్యలు వస్తే సంప్రదించండి



వర్షాలు కురుస్తున్నాయి. రైతులు, వినియోగదారులు విద్యుత్ సమస్యలు వస్తే సంబంధిత ఏఈ, సిబ్బందికి సమాచారం అందించాలి. నెలవారీ కరెంట్ బిల్లులో ఏఈ ఫోన్ నంబర్ ఉంటుంది. ఆ నంబర్‌ను సంప్రదించాలి. సిబ్బంది స్పందించకపోతే డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలి.
– మధుసూదన్‌రావు, ఎస్‌ఈ వరంగల్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి





అధికారులతో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా, మద్యం బాటిల్‌ను ఎస్సైకి చూపుతున్న సీపీ

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- జంట హత్యల కేసుపై విచారణ

చెన్నారావుపేట: విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ పైన ఉన్న సెంట్రి పోస్ట్‌ను పరిశీలించారు. కేసులకు సంబంధించిన డైరీని పరిశీలించారు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని ఎస్సై అరుణ్‌కు సూచించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల వివరాల అడిగారు. కేసులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ము ఖ్యంగా గంజాయి, డ్రగ్స్ విషయంలో సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పదహారు చింతల్ తండాలో జరిగిన జంట హత్యల కేసుపై పికెటింగ్ నిర్వహిస్తున్నామన్నారు. దీపిక, మదన్‌కు సెక్యూరిటీ కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పదహారు చింతల్ తండాకు వెళ్లి జంట హత్యలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

పోలీస్ స్టేషన్‌పై బ్రాండీ బాటిల్..!

స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న క్రమంలో స్టేషన్ భవనంపై ఉన్న సెంట్రీ పోస్ట్‌ను పరిశీలించడానికి సీపీ పైకి ఎక్కారు. అక్కడ తాగిపడేసిన మద్యం ఫుల్‌బాటిల్ కనిపించడంతో దానిని తీసుకుని ఎస్సై అరుణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, సిబ్బంది ఉన్నారు.

పథకాలు అందేలా చూడాలి

- జెడ్పీసీఈఓ రాంరెడ్డి



వర్ధన్నపేటలో ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న రాంరెడ్డి

రాయపర్తి: ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు దొర్లినా సరి చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ చూపాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో రాయపర్తి ఎంపీడీఓ గుగులోతు కిషన్, వర్ధన్నపేట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఎంపీఓ ధనలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శేషగిరి, పంచాయతీ కార్యదర్శి గుగులోతు అశోక్, మంజుల, సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ షిప్ ఏర్పాటును వేగవంతం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి

కాశోజీ సెంటర్: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ భూములు ఇచ్చిన నిర్వాసితులకు టౌన్ షిప్ ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారదాదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ భూ సేకరణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు భూములు అప్పజెప్పిన నిర్వాసితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనలో ఆదేశించిన విధంగా టౌన్ షిప్ ఏర్పాటు చేసి అందులో అవసరమైన మౌలిక సదుపాయాలైన పాఠశాల, కమ్యూనిటీ హాల్, ప్లే గ్రౌండ్, స్కిల్ వెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మ్యాప్‌లను కుడా సిద్ధం చేసి సమర్పించాలని ఇరిగేషన్, టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి, ఈఈ సునీత, ఆర్ అండ్ బీ అధికారి జితేందర్ రెడ్డి, పటరాజ్, గీసుగొండ, సంగెం తహసీల్దార్లు రియాజుద్దీన్, గనిపాక రాజ్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్లు, చింత నెక్కొండ గ్రీన్ ఫీల్డ్ హైవే రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏనుగల్లు, చింత నెక్కొండ గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ మార్కెట్ విలువ ప్రకారం రైతులకు పరిహారం అందేలా చూస్తానని అన్నారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కాగా ఎకరానికి రూ.కోటి పరిహారం అందించేలా చూడాలని రైతులు అదనపు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి

- జిల్లా బాలికా విద్యాభివృద్ధి అధికారి ఫ్లోరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోరెన్స్

చెన్నారావుపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా బాలికా విద్యాభివృద్ధి అధికారి కొల్లూరి ఫ్లోరెన్స్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థుల హాజరుశాతం, పాఠశాల అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం అమలు పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల పురోగతి, అభ్యాసన ఫలితాల సాధన, పాఠశాల సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, తదితర అంశాలపై చర్చించుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించి, చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు చింతకింది సుజాత మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో మధ్యలో నిలిచిపోయిన పనులకు నిధులు కేటాయించాలని కోరారు. హెచ్‌ఎం జయ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు పలు జాతీయ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారని అన్నా రు. 30నూతన అడ్మిషన్లు జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మొగిళి, సీహెచ్ మాధవి, రమాదేవి, సతీష్‌కుమార్, స్వప్న, జాహీద్, చింతకింది ఇందిరా, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంపై ధరాభారం

- తలలు పట్టుకుంటున్న వంట ఏజెన్సీలు
- ధరల పెరుగుదలతో బెంబేలు



నెక్కొండ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ మహిళలు

నెక్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల హాజరు శాతం పెంచడంతోపాటు మధ్యాహ్న ఆకలి వెతలు తీర్చేందుకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ధరాభారం పడుతోంది. ఇటీవల నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు పెరగడంతో పథకం అమలులో ఏజెన్సీలకు ఇబ్బందులు తప్పడంలేదు. నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించి మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసి వడ్డించడంలో అదనపు ఆర్థిక భారం తప్పడం లేదు. దీనికి తోడు నగదు చెల్లింపుల్లో జాప్యం నెలకొనడంతో ఏజెన్సీల సభ్యులు అప్పులతో ఈ పథకాన్ని నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ధరల పెరుగుదలతో బెంబేలు

పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంతో పంటలు దెబ్బ తింటున్నాయి. దీంతో కూరగాయల ధరల పెరుగుదలతో ఏజెన్సీల సభ్యులు బెంబేలెత్తుతున్నారు. కిలో టమాటా రూ.80, క్యారెట్ రూ.100, బీట్‌రూట్ రూ.100, పచ్చిమిర్చి రూ.120, ఉల్లి రూ.60, బెండకాయ రూ.80, చింతపండు రూ.250 చొప్పున పెరిగింది. కోడిగుడ్డు ధర గ్రామీణ ప్రాంతాలో సుమారు రూ.6.25లకు చేరింది. విద్యార్థులకు అందించేందు నాణ్యతను పాటిస్తూ మధ్యాహ్న భోజనాన్ని సమకూర్చడం సమస్యగా మారిందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు.

ఏజెన్సీలకు చెల్లింపులిలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రూ.5.45, ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.8.17, తొమ్మిదో, పదో తరగతి విద్యార్థులకు రూ.10.67చొప్పున మధ్యాహ్న భోజనానికి చెల్లిస్తున్నారు. పెరిగిన ధరను పరిగణలోకి తీసుకుంటే చెల్లింపులు సరిపడడం లేదని ఏజెన్సీ బాధ్యులు వాపోతున్నారు. గత విద్యా సంవత్సరం 1–8 తరగతుల విద్యార్థుల మధ్యాహ్న భోజన చెల్లింపులు మార్చి వరకు పూర్తి చేశారు. తొమ్మది, పదో తరగతి విద్యార్థుల చెల్లింపులు బకాయి ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి వేసవి సెలవుల నాటికి చెల్లింపులు రాలేదు.

సకాలంలో బిల్లులు చెల్లించాలి



సకాలంలో బిల్లులు చెల్లిస్తే మధ్యాహ్న భోజన పథకాన్ని సజావుగా సాగించేందుకు అవకాశం ఉంటుంది. బకాయిల వల ఇబ్బంది ఉంటుంది. తొమ్మిది, పదో తరగతి బిల్లులు ఇప్పటికీ రాలేదు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపులు చేయాలి.
– రామారపు రమ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యురాలు, నెక్కొండ

ధరల పెరుగుదలతో ఇబ్బంది..



రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెరిగిన ధరలతో కూరగాయలు, ఆకుకూరలు కొనే పరిస్థితి లేదు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని చెల్లింపులు జరగాలి. సకాలంలో బిల్లులు రాక అప్పులు చేయాల్సి వస్తోంది.
– కొడారి లత, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యురాలు, నెక్కొండ

బకాయిలు విడుదలయ్యాయి



గత విద్యా సంవత్సరం బకాయిలు నిధులు విడుదలయ్యాయి. తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల భోజన బిల్లుల చెల్లింపులు మాత్రం ఈ ఏడాది జనవరి నుంచి చెల్లించాల్సి ఉంది. బకాయి వివరాలు ఉన్నతాధికారులకు సమర్పించాం. నిధులు విడుదలైన వెంటనే చెల్లింపులు జరుగుతాయి.
– రత్నమాల, ఎంఈఓ, నెక్కొండ

జిల్లాలో మోస్తరు వర్షం

చెన్నారావుపేట: జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలలోకి నీరు చేరుతోంది. ఇప్పటి వరకు 13మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో మరో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీలో)
గీసుగొండ	25.6
దుగ్గొండి	26.2
నల్లబెల్లి	22.4
నర్సంపేట	24.6
ఖానాపురం	28.4
చెన్నారావుపేట	25.4
సంగెం	23.0
వర్ధన్నపేట	26.4
రాయపర్తి	16.8
పర్వతగిరి	23.8
నెక్కొండ	26.4
ఖిలా వరంగల్	28.2
వరంగల్	26.4

ఏకకాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే..



రుణమాఫీ చెక్కులు అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ఘనత అని, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచిలో నందనం ఎఫ్‌ఎస్‌సీఎస్ సొసైటీ పరిధిలో పంట రుణాలు తీసుకున్న 41 మందికి రూ.25,86 లక్షల రుణమాఫీ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే పార్టీ అగ్రనేతలు సోనియగాంధీ, రాహుల్ గాంధీ హామీ మేరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సీఎం రేవంత్‌రెడ్డి మాటల ద్వారా కాకుండా చేతలతో నిరుపిస్తున్నారన్నారు. నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, పద్మ, ఎలేంద్ర, రాజ్‌కుమార్, సంపత్‌రావు, బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, సొసైటీ సీఈఓ సంపత్, రైతులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వర్షంతో కూలిన ఇల్లు



కూలిన ఇంటి వద్ద నర్సయ్య

ఖానాపురం: వరుసగా కురుస్తున్న వర్షాలతో ఇల్లు కూలిపోయిన ఘటన మండలంలోని ధర్మరావుపేటలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొల్గూరి నర్సయ్య ఇల్లు వర్షాలతో కూలిపోయింది. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

20.9 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న పాకాల సరస్సు

ఖానాపురం: మండలంలోని ప్రధాన నీటి వనరు పాకాల సరస్సు నీటి మట్టం 20.9 ఫీట్లకు చేరుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి నీరు వచ్చి చేరుతోంది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు కాగా మరో 2.3 ఫీట్ల నీరు చేరితే ఆయకట్టు పరిధిలో పంటలకు నీరు సరిపోయే అవకాశం ఉంటుంది. సరస్సులోకి నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాలధారలా.. భీమునిపాద జలపాతం


సీతానగరం శివారు అడవిలో పాలధారలా భీమునిపాద జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని సీతానగరం శివారు కొమ్ముల వంచ సమీప దట్టమైన అడవిలోని భీమునిపాద జలపాతం శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి పాలధారలా జాలువారుతోంది. పర్యాటకులు చేరుకొని జలపాతాన్ని వీక్షిస్తూ నీటిలో ఆటలాడారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధి తానిపర్తి గ్రామానికి చెందిన బానారి రాజు(45) గురువారం గోదావరిలో చేపల వేటకు వెళ్లి గల్లంతు కాగా శనివారం అతడి మృతదేహం లభ్యమైంది. రాజు మృతదేహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి రేవు సమీపంలో గోదావరిలో లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు సున్నంబట్టి రేవు గ్రామానికి వెళ్లి పరిశీలించి రాజు మృతదేహంగా గుర్తించారు.

ఉధృతంగా గోదావరి

మారుమూల గ్రామాల నుంచి బాధితుల తరలింపు
- ప్రమాదాన్ని అంచనా వేస్తున్న అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు


రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండి కళకళలాడుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతి అంచనా వేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏటూరునాగారం మండలంలో 75 మిల్లీమీటర్లు, మంగపేట 11.5 మిల్లీమీటర్లు, వాజేడు 26 మిల్లీమీటర్లు, వెంకటాపూర్ 14.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కన్నాయిగూడెం మండల వ్యాప్తంగా 43.8 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇలా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి ఉప నదులు ఉప్పొంగి గోదావరిలో వరద అధిక మొత్తంలో చేరుతోంది. ఈ కారణంగా తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం నాటికి 79. 2 0 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అధికారులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి బ్యారేజీకున్న 59 గేట్లు ఎత్తివేయడంతో నీరు బ్యారేజ్ నుంచి ఉరకలేస్తూ కింది ప్రాంతానికి ప్రవహిస్తుంది. దీంతో రామన్నగూడెం వద్ద గోదావరి ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద సాయంత్రం నాటికి 12.21 మీటర్ల చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తోంది. ఐటీడీఏ, జలవనరుల శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ఉన్నతాధికారులు, సిబ్బందికి సమాచారం అందిస్తున్నారు. వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశాలు ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

రాకపోకలు నిషేధం..

మండలంలోని ఎలిశెట్టిపల్లి గ్రామానికి వాగు దాటి వెళ్లొద్దని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాగులో నుంచి సాహసం చేయొద్దని తెలిపారు. ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని తెలిపారు. ఏదైనా అవసరం ఉంటే తమకు సమాచారం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కోరారు.

కోతకు గురైన కరకట్ట..

కరకట్ట పరిస్థితి దినదినగండంగా మారింది. ఒక చోట కోత గురైందని ఇసుక బస్తాలు వేస్తే మరో చోట కోతకు గురవుతూ వస్తోంది. కలెక్టర్ దివాకర పరిశీలించిన 7 కిలోమీటర్ల ప్రాంతం కంటే ఇప్పుడు 6 కిలోమీటర్ల వద్ద కోతకు గురవుతూ వస్తోంది. దీనిని గమనించి ఇరిగేషన్‌శాఖ అధికారులు కర్రలను పాతి ఇసు బస్తాలు, ట్యూబ్స్ ద్వారా గోదావరి నది కరకట్టకు తాకకుండా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో గండిపడితే రామన్నగూడెం గ్రామం ఆనవాళ్లు లేకుండా పోయే ప్రమాదం ఉంది.

లోతట్టు ప్రాంతాల నుంచి బాధితుల తరలింపు


కొండాయి వద్ద స్ట్రెచర్‌పై అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలిని తీసుకొస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

మండలంలోని కొండాయి, ఎలిశెట్టి గ్రామాల సమీపంలో జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా మరపడవలను ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం ఇద్దరు మహిళలు తీవ్ర అస్వస్థ గురికాగా వారిని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఎలిశెట్టిపల్లి సమీపంలో కూడా జంపన్న వాగు అదే వేగంతో ప్రవహిస్తోంది. కాగా, గర్భిణులు దబ్బగట్ల శైలజ, పులిసె అనూష పురిటి నొప్పులతో బాధపడుతుండగా పడవల సాయంతో వారిని వాగు దాటించి ఆసుపత్రికి తరలించినట్లు పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సందీప్, ఏఎన్ఎం ఆదిలక్ష్మి తెలిపారు.

వరదకోతకు గురవుతున్న వాగు ఒడ్డు


వాగుఒడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న జనావాసాలు

మంగపేట: మండలంలోని రాజుపేట ముసలమ్మవాగు వరద ఉధృతికి ఒడ్డు కోతకు గురవుతోంది. దీంతో ఒడ్డు వెంట నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తిమ్మాపురం అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే వాగు రెండేళ్లుగా వర్షాకాలంలో భారీ వరదల కారణంగా బ్రిడ్జి సమీపంలో 15మీటర్ల వెడల్పుతో సుమారు 300 మీటర్లకు పైగా ఒడ్డు కోతకు గురైంది. అదే విధంగా బ్రిడ్జికి అవతలివైపు గల చెరుకుమిట్ట ప్రాంతంలో సుమారు 20 మీటర్లకు పైగా వెడల్పుతో 400 మీటర్ల వరకు ఒడ్డు కోతకు గురైంది. దీంతో బ్రిడ్జి సమీపంలోని బట్టు సతీశ్, దావీద్, భాస్కర్, ముగ్గల చెన్నయ్య నాలుగు కుటుంబాలకు చెందిన ఇళ్ల వరకు ఇప్పటికే ఒడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కుటుంబాలతో పాటు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ ప్రాంతాన్ని మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, మేడారం ట్రస్టుబోర్డు డైరెక్టర్ కొమరం అబ్బయ్య, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి శనివారం సందర్శించారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ.12 లక్షల విలువైన 60 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఇతర పోలీస్ అధికారులు

తొర్రూరు: తొర్రూరు డివిజన్ కేంద్రంలో శనివారం ఎండు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని గోపాలగిరి క్రాస్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనం అనుమానాస్పదంగా, వేగంగా వస్తుండగా నిలుపగా నలుగురు పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని తనిఖీ చేయగా 33 ప్యాకెట్లలో 60 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఒడిశాకు చెందిన ముఠా ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు ప్రాంతం మీదుగా జహీరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఒడిశాకు చెందిన ప్రహ్లాద్ సిసా, అప్పన్న బైరాగి, మిథుల సిసా, బసోతి పంగిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఎండు గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన బొలెరో వాహనాన్ని, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేశారు. ఈ కేసులో పలువురి కానిస్టేబుళ్లకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రివార్డులు అందించారు. సమావేశంలో సీఐ సంజీవ, ఎస్సైలు పిల్లల రాజు, గండ్రాతి సతీశ్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

కేయూ క్రాస్ వద్ద ముగ్గురు..

- 1.2 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సంజీవ


మాట్లాడుతున్న సీఐ సంజీవ

హసన్‌పర్తి: ముగ్గురు గంజాయి వ్యాపారులు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి 1.2కిలోల గంజాయితో పాటు మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీ క్రాస్ వద్ద ఎస్సై రాజ్‌కుమార్ బృందం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో కేయూసీ కంపౌండ్ వాల్ సమీపంలో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే పోలీసులు అక్కడి చేరుకోగా గమనించిన ఇద్దరు యువకులు పరారయ్యారు. ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని నయీంనగర్ ప్రాంతానికి చెందిన మంద సాయిగణేశ్, ఇనుగాల సన్నీ, దుంపేటి రాకేశ్‌గా చెప్పారు. దీంతో ముగ్గురి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ తెలిపారు.

కాజీపేటలో ఇద్దరు క్రయవిక్రయదారులు..

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఏరియాలో శనివారం గంజాయి క్రయవిక్రయాలు జరుపుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట సీఐ వై.సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి కాజీపేట రైల్వే ఏరియాలో పెట్రోలింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండి పోలీసులను చూసి పారిపోవడానికి యత్నిస్తుండగా పట్టుకున్నారు. వీరిని కాజీపేటకు చెందిన పాలెపాక సందీప్, వరంగల్‌కు చెందిన పద్య శ్రీగోపాలశర్మగా గుర్తించారు. వారి వద్ద ఉన్న కవర్లను తనిఖీ చేయగా గంజాయి లభించింది. సందీప్‌కు కాజీపేట సోమిడికి చెందిన కుమ్మరి వరుణ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. 15 రోజుల క్రితం వరుణ్ వైజాగ్ నుంచి 2 కిలోల గంజాయి తీసుకొచ్చి సందీప్‌కు అమ్మమని ఇచ్చి వైజాగ్ వెళ్లాడు. సందీప్ అందులో నుంచి కొంత సరుకు అమ్మాడు. రెండు రోజుల క్రితం వరుణ్ ఫోన్ చేసి కాజీపేటకు శ్రీగోపాల్ శర్మ అనే వ్యక్తి వస్తాడు అతడికి కొంత గంజాయిని అమ్మమని సందీప్‌కు చెప్పాడు. 200 గ్రాముల గంజాయిని ప్యాక్ చేసుకొని రైల్వే కమ్యూనిటీహాల్ వద్ద గోపాల్‌శర్మకు ఇస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.35 వేల విలువైన 1.6 కిలోల గంజాయి, రూ.15వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, వరుణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

మేడిగడ్డకు వరద పోటు..

- కాళేశ్వరం వద్ద 9.100 మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం
- అన్నారం వద్ద 17వేలు, మేడిగడ్డకు 3.73 లక్షల క్యూసెక్కుల వరద
- ప్రాణహిత ద్వారా ఉధృతంగా తరలివస్తున్న వరద


కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలివెళ్తున్న వరద


కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి

కాళేశ్వరం : తెలంగాణ, మహారాష్ట్రల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులకు వరద జోరు పెరిగింది. తెలంగాణలోని గోదావరి, మహారాష్ట్రలో ప్రాణహిత నదికి వరద తాకిడి పెరగడంతో శనివారం ఎగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం(సరస్వతి) బ్యారేజీ వద్ద మానేరు వాగు నుంచి వరద 17వేల క్యూసెక్కులు తరలివచ్చింది. బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు పూర్తిగా ఎత్తి నీటిని దిగువకు వదలగా కాళేశ్వరం చేరుతోంది. అటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో గడ్చిరోలి జిల్లా మీదుగా ప్రాణహిత నది వరద ఉధృతి పెరుగుతోంది. ఆ వరద నీరు అంతా కలిసి కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద కలుస్తోంది. దీంతో కాళేశ్వరం పుష్కరఘాట్ల వద్ద 9.100 మీటర్లు ఎత్తులో నీటిప్రవాహం తరలిపోతుంది. కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన దిగువ నుంచి తరలి మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి చేరుతుంది. బ్యారేజీవద్ద 3.73 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. బ్యారేజీలో మొత్తం 85గేట్లు పైకి ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు తరలిస్తున్నారు. రాత్రి వరకు మరింత పెరిగే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

సమ్మక్క బ్యారేజీకి భారీగా వరదనీరు..


సమ్మక్క సాగర్ వద్ద ప్రవహిస్తున్న గోదావరి

కన్నాయిగూడెం: కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామ సమీపంలో గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం భారీగా పెరుగుతోంది. శనివారం బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీ 59గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 79.20మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. అదేవిధంగా వాజేడు మండలం పేరూరు వద్ద శుక్రవారం సాయంత్రం గోదావరి నీటి మట్టం 12.73 మీటర్లు ఉండగా శనివారం సాయంత్రానికి 13.14 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో గంటకు పది సెంటీమీటర్ల చొప్పున గోదావరి నీటిమట్టం పెరుగుతుందని పేరూరు సీడబ్ల్యూసీ సిబ్బంది తెలిపారు.

అధికారులు అప్రమత్తం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి.దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు లోలెవల్ వంతెనల మీదుగా వరద పారుతున్న నేపథ్యంలో అధికారుల బృందం శనివారం చంద్రుపల్లి వాగు, కాళేశ్వరం గోదావరి నదిని పరిశీలించి సిబ్బందికి రక్షణ చర్యలకు సూచనలిచ్చారు. గోదావరిలో స్నానాలకు అనుమతించొద్దని, వాగులపై నుంచి దాటకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై చక్రపాణి, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.


ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి నుంచి పడవలో గర్భిణులను దాటిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


ఎలిశెట్టిపల్లి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు


రామన్నగూడెం పుష్కరఘాట్‌కు 6కిలోమీటర్ల దూరంలో కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట

తల్లిదండ్రులు లేని జీవితం ఎందుకుని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య
- పెగడపల్లిలో ఘటన


హరీశ్(ఫైల్)

హసన్‌పర్తి: తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో వారు లేని జీవితం తనకు ఎందుకని మనస్తాపం చెందిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తి మండలం పెగడపల్లికి చెందిన పిన్నింటి హరీశ్(30) తల్లిదండ్రులు కొంత కాలం క్రితం మృతి చెందాడు.అప్పటి నుంచి ఇంటిలో ఒక్కడే ఉంటూ మానసిక వేదనకు గురవుతున్నాడు. తల్లిందండ్రులు లేకుండా ఒంటరి జీవితం ఎలా గడపాలని భావించిన హరీశ్.. ఈనెల 18వ తేదీన పురుగుల మందుతాగాడు. ఎంజీఎం తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

- వెండి కిరీటం, హుండీలో డబ్బు అపహరణ

కేసముద్రం: ఆలయ తాళం పగులగొట్టి అందులోని వెండికిరీటం, హుండీలోని డబ్బు అపహరించిన ఘటన మండలంలోని సబ్‌స్టేషన్ తండాజీపీలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్‌తండాజీపీలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయ తాళాన్ని శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. సుమారు రూ. 40 వేల విలువైన 417 గ్రాముల అమ్మవారి వెండికిరీటంతోపాటు, హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బు అపహరించారు. శనివారం ఉదయం ఆటుగా వెళ్లిన స్థానికులు చోరీ జరిగినట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై వంశీధర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏజెన్సీలో జ్వరంతో యువకుడి మృతి


దళ్‌సింగ్ (ఫైల్)

బయ్యారం: ఏజెన్సీలో జ్వరంతో బాధపడుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బంజరతండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ దళ్‌సింగ్(33)కు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఆరు నెలల కుమారుడు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొని మహిళ మృతి

- ప్రమాద సమయంలో కారులోనే రాజయ్య
- బాపూజీనగర్ వద్ద వాహనం వదిలి వెళ్లిన వైనం



మహిళ మృతదేహం.. బాపూజీనగర్‌లో వదిలివెళ్లిన కారు

మడికొండ: స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన మడికొండ ఎస్సీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కలకొట్ల స్వప్న(40) పనినిమిత్తం నడుచుకుంటూ ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొట్టింది. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద సమయంలో రాజయ్య కారులోనే ఉన్నాడని, అయితే కారును డ్రైవర్ నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం అనంతరం కారును మాత్రం బాపూజీనగర్‌లో రోడ్డుపై వదిలిపెట్టిపోయారు. మృతురాలికి భర్త రాజు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో ఎనిమిదేళ్ల బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం నిందితుడిపై పోక్సో నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెగడపల్లికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక రెండు రోజుల క్రితం అదే ప్రాంతంలో ఉన్న సుమన్ అనే యువకుడి ఇంటికి వెళ్లింది. తన తల్లికి ఫోన్ చేయడం కోసం మొబైల్ అడిగింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఆ యువకుడు బాలికలను ఇంట్లోకి తీసుకెళ్లి నగ్నం చేసి అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి అక్కడినుంచి ఇంటికి వెళ్లింది. తల్లికి జరిగిన ఘటనను వివరించింది. ఈ మేరకు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపారు. లైంగిక దాడికి యత్నించడం వాస్తవంగా తేలడంతో సుమన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంజీవ చెప్పారు.